సాక్షి
సిద్దిపేట
గురువారం । 2 । మార్చి । 2023



అపరిచిత కాల్స్‌కు స్పందించొద్దు
సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దని సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి సూచించారు. 8లో..



పల్లెలు బాగుంటేనే దేశాభివృద్ధి
పల్లెలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ అన్నారు. 8లో..



పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోటీలు
అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాస, పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. 9లో..

న్యూస్‌రీల్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్



సిద్దిపేటరూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అన్నారు. కంటి వెలుగు పథకంలో జిల్లాలో నేటికి 2 లక్షల మందికి పైగా కంటి పరీక్షలను నిర్వహించారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. దీని ద్వారా ప్రతిరోజు జిల్లాలో 45 క్యాంప్‌ల నిర్వహించి ప్రతి క్యాంపు ద్వారా 150 మందికిపైగా ప్రజల కళ్ళను పరీక్షించి అవసరమైన కళ్ల అద్దాలను అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

రెండు లక్షల మందికి కంటి పరీక్షలు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్

సిద్దిపేటకమాన్: కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 2,00,687 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ, అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో 29 రోజులుగా 47 వైద్య బృందాల ద్వారా 2,00687 మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. వీరిలో 42,528 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. 32,896 మందికి అద్దాలు ఆర్డర్ పెట్టడం జరిగిందన్నారు.

నేడు రేవంత్‌రెడ్డి పాదయాత్ర

అన్ని ఏర్పాట్లు సిద్ధం



కట్కూర్ క్రాస్ వద్ద ఏర్పాట్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): హుస్నాబాద్ నియోజకవర్గంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాదయాత్ర గురువారం సాయంత్రం 03 గంటలకు అక్కన్నపేట మండలం అంతక్కపేట శివారులోని కట్కూర్ క్రాస్ నుంచి ప్రారంభం కానుంది. ఆయన కట్కూర్ క్రాస్‌కు బుధవారం అర్ధరాత్రి చేరుకొని అక్కడే బస చేశారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పాదయాత్రకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 9 గంటలకు భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి వారిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుంది. కాగా సాయంత్రం 5 గంటలకు హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్ ఉంటుంది.

కేంద్ర నిధులతో రాష్ట్ర పథకాలు



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే రాష్ట్రంలో చాలా పథకాలు అమలవుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం చిన్నకోడూరు, మేడిపల్లి గ్రామాల్లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు వస్తేనే కేసీఆర్‌కు హామీలు గుర్తుకువస్తాయన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రజలంతా బీజేపీ వైపే ఉన్నారన్నారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే కేసీఆర్ తొమ్మిదేళ్ల నుంచి ప్రకృతి విపత్తుల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిట్ల పరుశరాములు, నాయకులు భూమేశ్‌గౌడ్, రాజిరెడ్డి, మహేందర్ రెడ్డి, నాగరాజు, శివరాంగౌడ్, శంకర్ బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వసూళ్లు సరే.. వసతులేవి?

- ఆలస్యమవుతున్న ఫాస్టాగ్ స్కానింగ్
- నిత్యం 10–12వేల వాహనాల రాకపోకలు
- దుద్దెడ టోల్‌ప్లాజా వద్ద కనీస సౌకర్యాలు కరువు
- వాహనదారులకు తప్పని తిప్పలు



దుద్దెడ టోల్ గేట్ వద్ద వాహనాలు



పొదల మధ్య దర్శనమిస్తున్న టాయిలెట్స్

సాక్షి, సిద్దిపేట: వాహనదారుల ముక్కు పిండి టోల్ ట్యాక్స్ వసూలు చేస్తున్న టోల్‌ప్లాజా నిర్వాహకులు వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. హైదరాబాద్ నుంచి రామగుండం హైవేపై జిల్లాలోని కొండపాక మండలం దుద్దెడ వద్ద టోల్‌ప్లాజాను ఏర్పాటు చేశారు. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించడాన్ని నిర్వాహకులు విస్మరిస్తున్నారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

- హైదరాబాద్ –రామగుండం స్టేట్ హైవే(రాజీవ్ రహదారి) జిల్లాలో సుమారుగా 120 కిలో మీటర్లు ఉంది. ములుగు మండలం తుర్కపల్లి నుంచి ప్రారంభమై బెజ్జంకి మండలం తోటపల్లి వరకు ఉంటుంది.
- దుద్దెడ వద్ద జూన్1, 2014న ఈ టోల్ ప్లాజాను ఏర్పాటు చేశారు. ఇది 25 ఏళ్లపాటు కొనసాగనుంది.
- రోజుకు సగటున ఈ టోల్‌గేట్ ద్వారా 10 నుంచి 12 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. శని, ఆది వారాలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య 12 నుంచి 15 వేల వరకు చేరుతుంది.
- ఈ ప్లాజా వద్ద వాహనదారుల కోసం విధిగా తాగునీరు, టాయ్‌లెట్స్, రెస్ట్ రూం, ప్రథమ చికిత్స, సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత నిర్వాహకులది. కానీ ఇక్కడ ఏ కనీస సౌకర్యాలు కల్పించలేదు.
- టాయ్‌లెట్స్‌ను గతంలో కంటైనర్‌లో ఏర్పాటు చేయడం గమనార్హం. ప్లాజా వద్ద సొంత భవనం నిర్మించినప్పటికీ టాయ్‌లెట్స్ సౌకర్యం లోపల ఉందని సమాచారం ఎవరికీ తెలియకపోవడంతో బయట ఉన్న పాత కంటైనర్‌లోని చూసి అటుగా వెళ్లడం మానేశారు.
- దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు సరైన తాగునీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
- అలాగే పెట్రోలింగ్‌కు సంబంధించిన ఫోన్ నంబరు ఎక్కడ డిస్‌ప్లే చేయకపోవడంతో వాహనదారులు అత్యవసర సమయాల్లో ఎవరిని సంప్రదించాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.
- ప్రతి కిలోమీటరు ఒక దగ్గర పెట్రోలింగ్ ఫోన్ నంబరును రాసి పెట్టాలి. ఫోన్ నంబరు ఎవరికీ తెలియకపోవడంతో రాత్రి సమయంలో టైర్ పంక్చర్ అయినా, ఇంధనం అయిపోయినా, వాహనం రిపేర్ అయినా, రోడ్డు ప్రమాదం జరిగినా ఎవరికి ఫోన్ చేయాలో తెలియని దుస్థితి.
- కొన్ని వాహనాలకు ఫాస్టాగ్ కొంత ఆలస్యమవుతోంది. స్కానింగ్ ఆలస్యంగా అవుతుండటంతో అప్పుడప్పుడు వాహనాలు బారులు తీరుతున్నాయి. ఫాస్టాగ్ స్కాన్ కాకపోవడంతో హ్యాండ్ స్కానర్‌తో చేస్తున్నారు.
- టోల్‌ప్లాజా ద్వారా ఆదాయం సమకూరుతున్నా సౌకర్యాలు కల్పించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- ఇప్పటికైనా ప్లాజా వద్ద వాహనదారులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు.

తాగుదామంటే నీళ్లు లేవు



నెలలో 10 సార్లు ఈ టోల్ ప్లాజా మీదుగా రాకపోకలు సాగిస్తాం. ఇక్కడ టాయ్‌లెట్స్ సౌకర్యం లేదు. బయట ఉన్న టాయ్‌లెట్స్ ఉపయోగంలో లేవు. తాగుదామంటే నీళ్లు లేని పరిస్థితి. సిబ్బందిని అడిగితే దాబాయిస్తారు. ప్రతీసారి మా లారీ ఫాస్టాగ్ ద్వారా టోల్ రూ.595 చెల్లిస్తున్నం.. అధికారులు స్పందించి కనీస వసతులు ఏర్పాటు చేసేలా చూడాలి.

–అప్సర్, లారీ డ్రైవర్

టాయిలెట్స్‌ను లోపలికి మార్చాం..



రోడ్డుపై అక్కడక్కడ పెట్రోలింగ్ ఫోన్ నంబర్ డిస్‌ప్లే చేశాం. మరిన్ని చోట్ల అందరికీ కన్పించే విధంగా డిస్‌ప్లే చేస్తాం. టాయ్‌లెట్స్‌ను లోపలికి మార్చాం. టాయ్‌లెట్ సౌకర్యం అందుబాటులో ఉందని డిస్‌ప్లే ఏర్పాటు చేస్తాం. తాగునీటి సౌకర్యం రెండు గేట్ల దగ్గర ఉన్నాయి. మరిన్ని చోట్లు ఏర్పాటు చేస్తాం.

–అశోక్‌రెడ్డి, టోల్ ప్లాజా మేనేజర్



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ మహిళా నాయకులు

కేంద్రానికి మహిళల ఉసురు తప్పదు

పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా ఆందోళన

సిద్దిపేటజోన్: నిత్యావసర ధరలు, వంట గ్యాస్ ధరలను ఇష్టానుసారంగా పెంచుతున్న కేంద్ర ప్రభుత్వానికి మహిళల ఉసురు తప్పకుండా తగులుతుందని బీఆర్‌ఎస్ మహిళ విభాగం నాయకులు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ రోడ్డుపై కట్టెలపొయ్యి పెట్టి వంట చేసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్న బీజేపీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ధరను రూ.50 పెంచడం సరికాదని మండిపడ్డారు. మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు నర్సమ్మ, సువర్ణ, విజయ, నిర్మల, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సాయిరాం, చంద్రం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట కీర్తి, ప్రతిష్టను ఇనుమడింపచేస్తా

'సాక్షి'తో నూతన మున్సిపల్ కమిషనర్ సంపత్



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ సంపత్

సిద్దిపేటజోన్: 'దేశ, రాష్ట్ర స్థాయిలో సిద్దిపేట ఇప్పటికే గుర్తింపు సాధించింది. రోల్ మోడల్ మున్సిపాలిటీగా నిలిచింది. అలాంటి సిద్దిపేట కీర్తి, ప్రతిష్టలను మరింత ఇనుమడింప చేసేలా శక్తివంచన లేకుండా పనిచేస్తా.. సిద్దిపేటోళ్లకు కొత్తగా చెప్పక్కర్లేదని పాలకవర్గం తోడ్పాటు, అధికారుల సహకారం, ప్రజల భాగస్వామ్యంతో మంత్రి హరీశ్‌రావు ఆలోచన విధానాలకు అనుగుణంగా సంపూర్ణ లక్ష్యాలను సాధిస్తాం.' అని అన్నారు సిద్దిపేట మున్సిపల్ నూతన కమిషనర్ సంపత్. ఆయన బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1988 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి, 2013లో గ్రూప్–2 ద్వారా మున్సి పల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. మణుగూరు(ఖమ్మం) జగిత్యాల, కొత్తగూడెం, నిర్మల్ మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా పనిచేసి ప్ర స్తుతం సిద్దిపేటకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను 'సాక్షి'తో ముచ్చటించారు.. ఆయన మాటల్లోనే..

ప్లాస్టిక్ వినియోగం వద్దు

సిద్దిపేట మున్సిపాలిటీలో పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. మంత్రి హరీశ్‌రావు లక్ష్యాలకు అనుగుణంగా పాలకవర్గ సహకారాన్ని తీసుకొని బల్దియా కీర్తిని కాపాడేలా ప్రయత్నిస్తాను. మున్సిపల్ ప్రగతికి స్థానిక పరిస్థితులను బట్టి కార్యాచరణ సిద్ధం చేస్తాం. ముందుగా పూర్తిగా స్టడీ చేసి అందుకు అనుగుణంగా డిజైన్ చేస్తాం. ఇప్పటికే స్వచ్ఛబడి గూర్చి తెలుసుకున్న. ఇది చెత్తను పునర్వినియోగం చేసే గొప్ప ప్రక్రియకు తరగతి గది. దీన్ని గూర్చి మరింత విస్తృతంగా ప్రచారం చేయిస్తాం. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి పటిష్టంగా నిర్వహిస్తాం. హరితహారంలో భాగంగా మొక్కల సంరక్షణలో అందరి భాగస్వామ్యం అవసరం. మున్సిపల్‌చట్టం మేరకు అక్రమ నిర్మాణాలపై దృష్టి సారిస్తాం. నిబంధనల మేరకు ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పనిచేస్తాం. ప్రతి మున్సిపాలిటీకి ఆదాయ వనరులు ముఖ్యం, బల్దియాకు వచ్చే ఆదాయ వనరులు గూర్చి మొదటగా అధ్యయనం చేసి తద్వారా వనరుల సమీకరణకు చర్యలు తీసుకుంటాం. వంద శాతం పన్నులు వసూలు చేసేలా కృషి చేస్తా. సిద్దిపేట ప్రజలకు ఇప్పుడు కొత్తగా నేను ఏమీ చెప్పక్కర్లేదు. చివరగా.. మొక్కలను కాపాడండి, ప్లాస్టిక్ వినియోగం వద్దు. స్టీల్ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో పన్నులు చెల్లించి బల్దియాకు సహకరించాలి.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన వ్యక్తం చేస్తున్న దృశ్యం

దుబ్బాకటౌన్: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో దుబ్బాక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట టీచర్లు, ఆయాలు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు ఈఎస్‌ఐ,ఉ ద్యోగ భద్రత కల్పించాలన్నారు. 2018 అక్టోబర్‌లో కేంద్రం పెంచిన వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. న్యాయమైన డిమాండ్లు సాధించేంత వరకు సమ్మె చేపడుతామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడుతూ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో కె.భాస్కర్, పద్మ, రమ, విజయ, భూలక్ష్మి, బసవరాణి, అనిత, ప్రేమల, శ్యామల, తదితరులు ఉన్నారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్రం : ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్: కేంద్ర ప్రభుత్వం రోజు రోజుకు గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల సమస్యలను పట్టించుకోకుండా మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలపై భారం మోపడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. గ్యాస్‌తో పాటు నూనె, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ఈ మేరకు నేడు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.


సీఐటీయూతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న చుక్క రాములు

గజ్వేల్‌రూరల్: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సీఐటీయూ ముందుండి పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోని రాణే పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల సందర్భంగా బుధవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లోని కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ నిరంతరం కృషి చేస్తుందన్నారు. వేతన ఒప్పందం, మెడిక్‌లెయిం పాలసీలు, బీమా, ఇన్సూరెన్స్ తదితర అంశాలపై కార్మికులకు న్యాయం జరిగేలా యాజమాన్యాలతో పోరాటం నిర్వహించినట్లు గుర్తు చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న యూనియన్లకు తగిన గుణపాఠం చెబుతూ.. ప్రస్తుతం జరుగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో చుక్క గుర్తుకు ఓటు వేసి సీఐటీయూ నాయకులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, నాయకులు బండ్ల స్వామి, భిక్షపతి, సాజిద్, చంద్రశేఖర్‌రెడ్డి, శివయ్య, వెంకట్రావ్, రంగారెడ్డి, కుత్బుద్దీన్, కుమార్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు టీవీ, ఫోన్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): పదో తరగతి విద్యార్థులు టీవీ, ఫోన్లకు దూరంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మద్దూరు మండలంలోని నర్సాయపల్లి, సలాఖపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి 10 జీపీఏ సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇలా మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి మంత్రి హరీశ్‌రావు ప్రోత్సాహకంగా రూ.10వేలు అందజేస్తారన్నారు. పరీక్ష సమయంలో ఆందోళన చెందకుండా పరీక్షలు రాయలన్నారు. ఉదయం, సాయంత్రం ప్రణాళికబద్ధంగా చదువుకోవాలన్నారు. గతంలో కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహారెడ్డి, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు తదిరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం కొత్త పుంతలు

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గజ్వేల్: రైతు సంక్షేమాన్ని కొత్త పుంతలు తొక్కించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ మార్కెట్‌యార్డులో 'గడా' ప్రత్యేకాధికారి ముత్యం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్ జేజేల వెంకటేశంగౌడ్‌తో కలిసి పొద్దు తిరుగుడు, శనగల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తున్నదన్నారు. రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర అందించి అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. శనగలను 14శాతం లోపు తేమ ఉండేలా తీసుకొచ్చి మద్దతు ధర రూ.5,335, పొద్దు తిరుగుడు 9శాతం లోపు తేమ ఉండేలా చూసుకొని రూ.6,400 మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, బెండ మధు, పట్టణశాఖ అధ్యక్షుడు నవాజ్‌మీర, మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ, ఏడీఏ బాబునాయక్, వ్యవసాయాధికారి నాగరాజు, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ మహిపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒగ్గు పూజారిపై దాడిచేసిన నిందితుల అరెస్ట్

దుబ్బాకరూరల్: మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన ఒగ్గు పూజారి పయ్యావుల దేవయ్య(48)పై దాడి చేసిన నిందితులు పరారయ్యారు. బుధవారం వారిని పట్టుకున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. నిందితులు గంగరాజు(27), బాలమల్లు(45), వెంకటేశ్(37), నరేష్(32), రాజయ్య(43)పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

యాంటీ ర్యాగింగ్‌పై వైద్య విద్యార్థులకు అవగాహన

సిద్దిపేటకమాన్: ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సిద్దిపేట త్రీ టౌన్ సీఐ భానుప్రకాశ్ వైద్య విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యవిద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయొద్దన్నారు. వైద్య వృత్తి ఎంతో విలువైందన్నారు. వైద్యులుగా సమాజానికి సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల వైద్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టి రుణం కొంత తీర్చుకున్న..

వీడ్కోలు సభలో కమిషనర్ రవీందర్‌రెడ్డి


రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న పాలకవర్గం

సిద్దిపేటజోన్: 'బాల్యం, చదువు అన్ని సిద్దిపేట ప్రాంతంలోనే.. అలాంటి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేయడం సంతోషంగా ఉంది. అనతి కాలంలోనే చాలా నేర్చుకున్న. ఈ స్థాయికి తెచ్చిన సిద్దిపేట మట్టి రుణం కొంతైనా తీర్చుకున్న.' అని బదిలీపై వెళ్తున్న సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ మంజులరాజనర్స్ అధ్యక్షతన ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిద్దిపేట పట్టణ అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించడానికి పాలకవర్గం, అధికారులు సంపూర్ణ మద్దతు ఇచ్చారన్నారు. మంత్రి హరీశ్‌రావు సహకారం, విధుల నిర్వహణలో ఆయన చూపిన మార్గదర్శనం గొప్పదన్నారు. అంతకుముందు చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ.. కొద్ది కాలంలోనే కమిషనర్‌గా మంచిపేరు సాధించారన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు, అధికారులు ఆయనను సన్మానించారు. అంతకుముందు నూతన కమిషనర్ సంపత్‌కు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు తిరుమల్, మల్లికార్జున్, కవిత, రేణుక, శ్రీదేవి, బాలలక్ష్మి, రవి, మోహిజ్, రియాజ్, లక్ష్మణ్, మహేందర్, శ్రీహరి, ఎల్లం, దీప్తి, బ్రమ్మం, సుందర్, విఠోభ, శ్రీనివాస్ యాదవ్, శోభారాణి, జయ, అరవింద్, యోగి, రేఖ ,మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, మహేష్, యాదగిరి, ఐల్లయ్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ జిల్లా చైర్మన్‌గా..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఆర్టీఐ జిల్లా చైర్మన్‌గా శ్రావణ్ కుమార్‌ను నియమిస్తూ జాతీయ యూత్ కాంగ్రెస్ ఆర్టీఐ చైర్మన్ డాక్టర్ అనిల్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి, సల్ల నరేశ్, కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, కరీంనగర్ జిల్లాఅధ్యక్షుడు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిశ్రమలో అగ్ని ప్రమాదం

మనోహరాబాద్(తూప్రాన్): షార్ట్ సర్క్యూట్‌తో కేబుల్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటన మనోహరాబాద్ మండలంలోని కూచారం శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కూచారం గ్రామ శివారులో వ్యాలీ ప్రోడక్ట్ పరిశ్రమ(కేబుల్)లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. రామాయంపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. భారీ నష్టం వాటిల్లినట్లు యజమాన్యం తెలిపింది.

అపరిచితుల ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు

సైబర్ నేరాలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన


సిద్దిపేటలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ భిక్షపతి

సిద్దిపేటకమాన్: సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట వన్‌టౌన్ సీఐ భిక్షపతి అన్నారు. సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాసర్‌పూర కాలనీ ప్రజలకు సైబర్ క్రైమ్, మహిళల భద్రత, సీసీ కెమెరాల ప్రాధాన్యత, మహిళా చట్టాలు, వరకట్న వేధింపులు తదితర అంశాలపై బుధవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాల్లో వేధిస్తే మహిళలు డయల్ 100 లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ మోసాలపై జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌ఐ నరసింహరావు, సిద్దిపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్ బందారం రాజు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): అపరిచితులు చేసే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హద్నూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చాల్కి జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం సైబర్ నేరాలు–తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మోసపూరితమైన కాల్స్, మెస్సెజ్‌లు పంపి ప్రజలను మోసం చేస్తున్నారని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండటమే కాకుండా ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు చెబితే తల్లిదండ్రులు వింటారని, వారికి తప్పనిసరిగా అవగాహన


చాల్కిలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వినయ్‌కుమార్


ర్యాలీ నిర్వహిస్తున్న జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు

కల్పించాలన్నారు. ముఖ్యంగా బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, బ్యాంక్ ఖాతా వివరాలను చెప్పాలని సైబర్ నేరగాళ్లు అడుతారేతప్ప బ్యాంక్ సిబ్బంది అలాంటి వివరాలు అడగరని చెప్పారు. అపరిచితులు ఫోన్ చేస్తే వ్యక్తి గత సమాచారంను చెప్పొద్దన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, 18 ఏళ్లు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని వాహనాలు నడపాలని సూచించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపడమే కాకుండా జరిమానా కూడా విధించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు, ఇతరులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, హెచ్‌ఎం మీనా కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వ్యక్తిగత బ్యాంకు వివరాలను అపరిచితులు అడిగితే చెప్పొద్దన్నారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే లింక్‌లు క్లిక్ చేయొద్దని హెచ్చరించారు. సైబర్ నేరం జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేందర్, ఏఎస్‌ఐ లక్ష్మణ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన ర్యాలీ

నర్సాపూర్‌రూరల్: మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు బుధవారం సైబర్ మోసాలు, నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పాఠశాల నుంచి కొడిపల్లి మండలం తునికి నల్ల పోచమ్మ ఆలయం వరకు ప్లకార్డ్స్ పట్టుకొని ర్యాలీ తీశారు. తునికి నల్ల పోచమ్మ ఆలయం ఆవరణలో సైబర్ మోసాలు, నాటిక, పాటల రూపంలో సైబర్ మోసాలు వివరించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు రామారావు, ప్రతిభ, ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు


గాయపడ్డ సురేశ్


గాయపడ్డ దుర్గాప్రసాద్

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామశివారులో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. బుధవారం కాట్రియాల గ్రామానికి చెందిన మైలారం సురేశ్ బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో హవేలిఘనపూర్ మండలం రాజ్‌పేటకు చెందిన దుర్గాప్రసాద్ బైక్‌పై రామాయంపేట వస్తున్నాడు. వారిద్దరి బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణ శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఎల్లయ్య (42) బైక్‌పై పట్టణ శివారు నాగదేవత టెంపుల్ నుంచి సిరిసిల్ల బైపాస్‌లో వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గంమధ్యలో టిప్పర్ ఢీకొనడంతో ఎల్లయ్య గాయపడ్డాడు. 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళలు నిర్భయంగా ముందుకు రావాలి

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని


షీటీంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ: మహిళలు మౌనం వీడి, నిర్భయంగా ముందుకు రావాలని, వేధింపుల నుంచి బయటపడాలని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మెదక్ షీ టీమ్స్ ఫిబ్రవరిలో ఇప్పటి వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. ఎనిమిది మందికి ఈవ్ టీజర్స్‌కు కౌన్సెలింగ్, మూడు పెట్టీ కేసులు, రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. వేధింపులకు గురయ్యే మహిళలు షీ టీంకు ఫిర్యాదు చేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్‌చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. ఎవరైన వేధిస్తే వెంటనే 100 లేదా షీటీమ్ వాట్సాప్ నంబర్ 6303923823, పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 08452-223533 కు ఫోన్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చదువుకునే విద్యార్థినులకు 18 ఏళ్లు నిండకుండానే వివాహం చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098 కు తెలియజేయాలన్నారు.

ప్రజ్ఞాపూర్ కళాకారుడికి డాక్టరేట్


గోవాలో డాక్టరేట్ అందుకుంటున్న ప్రవీణ్

గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్‌కు చెందిన కళాకారుడు పూదరి ప్రవీణ్‌కు డాక్టరేట్ లభించింది. చిన్నతనం నుంచే పాటలపై మక్కువతో పాఠశాల స్థాయి నుంచే మంచి గుర్తింపును సాధించాడు. సిద్దులు, వెన్నెల కళాబృందంలో సభ్యుడిగా ఉన్న ప్రవీణ్ తనదైన శైలిలో కాళ్లకు గజ్జె కట్టి తెలంగాణ ఉద్యమ, జానపద పాటలను పాడుతూ అందరిచే మన్ననలు పొందాడు. ఇటీవల గోవాలో జరిగిన కార్యక్రమంలో కన్నతల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రవీణ్‌కు డాక్టరేట్ అందజేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తనకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందన్నారు. గోవా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు సెల్వార్, అతిథులు యాసిప్ కరీనక్రుప్, కన్నతల్లి ఫౌండేషన్ చైర్మన్ రాజన్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్‌ముక్క గొంతులో ఇరుక్కొని మహిళ మృతి


సంతోషి మృతదేహం

వెల్దుర్తి(తూప్రాన్): చికెన్ ముక్క గొంతులో ఇరుక్కొని మహిళ మృతి చెందింది. ఈ ఘటన మెదక్ జిల్లా మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామశివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన సంతోషి (24), అంగోరి మాజీ అక్కాచెల్లెళ్లు. వీరిద్దరూ తమ బంధువులతో కలిసి కొప్పులపల్లి గ్రామశివారులోని ఓ ఇటుకబట్టీలో పనిచేస్తున్నారు. మంగళవారం తూప్రాన్ సంతకు వెళ్లి కూరగాయలతో పాటు చికెన్ తెచ్చారు. రాత్రి 11 గంటల సమయంలో భోజనం చేస్తుండగా సంతోషి గొంతులో చికెన్‌ముక్క ఇరుక్కుంది. బయటకు వచ్చి కేకలు వేయబోతూ ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన తోటి కార్మికులు విషయాన్ని ఇటుక బట్టీ యజమాని దృష్టికి తీసుకెళ్లి తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. పొట్టకూటి కోసం వలసవచ్చి ప్రాణాలు కోల్పోయిన సంతోషి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అవివాహిత కావడంతో కుటుంబసభ్యులు తూప్రాన్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు.

ఖారీజ్‌ఖాతా అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఆందోళన


కొండాపూర్‌లో నిరహారదీక్ష చేస్తున్న గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): తాతల కాలంనాటి నుంచి కబ్జాలో ఉన్న ఖారీజ్‌ఖాతా భూమిని రికార్డు పేరుతో తహసీల్దార్ అక్రమ రిజిష్టర్ చేశారని కొండాపూర్ గ్రామస్తులు బుధవారం ఒక రోజు నిరహారదీక్ష చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలంలోని కొండాపూర్ నివాస గృహాలకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 144లో 11ఎకరాల 37 గుంటలు ఉన్నదన్నారు. ఈ భూమిలో తాతల కాలంనాటి నుంచి గ్రామస్తులే కబ్జాలో ఉన్నారు. ఈ భూమి ఖారీజ్‌ఖాతా కావడంతో ఇప్పటి వరకు ఎవ్వరూ రాలేదన్నారు. కాగా రెండు నెలల క్రితం ఈ భూమిని అసలు పట్టదారులతో వేరేవారికి అక్రమ రిజిష్టర్ చేశారని గ్రామస్తులు ఆరోపించారు. తమకు న్యాయం జరగాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తిచేస్తే పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్ భిక్షపతిని వివరణ కోరగా రికార్డు ప్రకారమే పట్టదారు భూమి ధరణిలో ఉన్నందున రిజిష్టర్ చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు ఎందుకు నిరహారదీక్ష చేస్తున్నారో తెలియదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట భరోసా సెంటర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో సపోర్ట్ పర్సన్‌గా పనిచేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిద్దిపేట సీపీ శ్వేత బుధవారం తెలిపారు. ఈ ఉద్యోగానికి మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్హతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండి, 25 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి, విద్యార్హతలు ఉన్న వారు మార్చి 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తమ విద్యార్హత ధ్రువపత్రాలు, బయోడేటాతో సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని మహిళ పోలీస్ స్టేషన్ సీఐ దుర్గకు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 94407 95364 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రంగనాయక సాగర్ అద్భుతం

పంజాబ్ వ్యవసాయ శాఖ అధికారుల బృందం


రంగనాయక సాగర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ను బుధవారం పంజాబ్ రాష్ట్రానికి చెందిన వ్యవసాయ శాఖ అధికారుల బృందం సందర్శించింది. రిజర్వాయర్, పంప్‌హౌస్, బండ్‌ను పరిశీలించారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్ నిర్మాణం అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. రిజర్వాయర్ ద్వారా రెండు పంటలు పండుతాయని, ఈ ప్రాంతం పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలంగా మారుతుందన్నారు. రిజర్వాయర్ నిర్మాణం, సాగు తదితర అంశాలను ఈఎన్‌సీ హరిరామ్ బృందానికి వివరించారు. కార్యక్రమంలో కాళేశ్వరం ఎస్‌ఈ బస్వరాజ్, ఈఈ గోపాలకృష్ణ, ఏఈ ఖాజా ఉన్నారు.

చోరీ కేసులో నలుగురికి జైలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన రెండు చోరీ కేసుల్లో నలుగురికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు. బుధవారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రజ్ఞాపూర్‌లో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరగడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన గుండ్ర రాములు, నర్సిరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో నిందితులిద్దరికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధించారు. అదే విధంగా రెండో కేసు పిడిచెడ్ రోడ్డు మార్గంలో ఓ వైన్స్ ముందున్న స్కూటీని ఎత్తుకెళ్లారు. అందులోని రూ.3.50 లక్షల విలువైన బంగారు నగలు చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ కేసులో జైలు నుంచి విడుదలైన మహ్మద్ షరీఫ్, ఇతడికి సహకరించిన షాదుల్లాను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచారు. నేరం రుజువు కావడంతో మహ్మద్ షరీఫ్‌కు ఏడాది జైలు, షాదుల్లాకు మూడు నెలల జైలు శిక్ష ప్రిన్సిపల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సౌమ్య విధించారు.

చోరీ నిందితుడి అరెస్ట్


చోరీ వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

దుబ్బాకటౌన్: దుబ్బాకలోని 19వ వార్డు కౌన్సిలర్ ఎంగారి స్వప్న రాజిరెడ్డి ఇంట్లో ఫిబ్రవరి 27వ తేదీన దొంగతనానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సీఐ మున్నూరు కృష్ణ చోరీ కేసు వివరాలు వెల్లడించారు. సిద్దిపేటలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జంగోని సాయికుమార్(24) దొంగతనాలు చేస్తున్నాడు. దొంగతనం కేసులో పోలీసులకు పట్టుబడి ఫిబ్రవరి 15న బెయిల్‌పై విడుదలయ్యాడు. మళ్లీ ఫిబ్రవరి 27న ఇంటికి తాళం వేసి దుబ్బాక 19వ వార్డు కౌన్సిలర్ ఎంగారి స్వప్న రాజిరెడ్డి బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా భావించి ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, వెండి వస్తువులు సాయికుమార్ ఎత్తుకెళ్లాడు. ఇతడు ఆరు చోరీ కేసుల్లో నిందితుడని తెలిపారు. అతడి నుంచి ఐదు తులాల బంగారం, రెండు కిలోల వెండిని స్వాదీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న ఎస్‌ఐ మహేందర్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ రాంజీని సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

పల్లెలు బాగుంటేనే దేశాభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ


యాదవ సంఘం భవన నిర్మాణ శంకుస్థాపనలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): పల్లెలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని, తెలంగాణ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కిష్టాపూర్‌లో యాదవ సంఘం , వడ్డెర సంఘం భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే గోనెపల్లిలో కంటి వెలుగు శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అంధత్వ నివారణ కోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందం గౌడ్, రైతుబంధు జిల్లా డైరెక్టర్ వెంకటేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ వనిత రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు స్వరూప ఎల్లాగౌడ్, కవిత, ఎంపీటీసీ పద్మ మల్లేశం గౌడ్, లచ్చయ్య, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొల్చారం(నర్సాపూర్): అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముడుతలు మంగలి యాదగిరి (45) తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడం, మరోవైపు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కొంతకాలంగా తీవ్ర మానసిక ఒత్తికి లోనయ్యాడు. మంగళవారం రాత్రి భోజనం చేసి బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి తిరిగిరాలేదు. అదే రోజు రాత్రి 11.30 గంటల సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ప్రధాన రహదారి పక్కనున్న చెట్టుకు ఉరి వేసుకున్న వ్యక్తి కనిపించాడు. దీంతో గ్రామస్తులకు సమాచారం అందించడంతో అక్కడి చేరుకున్న వారు యాదగిరిగా గుర్తించారు. మృతుడికి భార్య శేకమ్మ, వివాహమైన కూతురు, కుమారుడు సాయి కృష్ణ ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


కార్లోసన్ మృతదేహం

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా రామగుండం మండల కేంద్రానికి చెందిన కార్లోసన్ సికింద్రాబాద్‌లోని మల్కాజ్‌గిరిలో ఉంటున్న బావ పులి కిరణ్‌కుమార్ ఇంటికి వచ్చాడు. బుధవారం స్వగ్రామం రామగుండం గ్రామానికి తండ్రి డేనివిన్సెంట్, బావ పులికిరణకుమార్‌తో రెండు బైక్‌లపై బయలుదేరారు. ఒక బైక్‌పై తండ్రి, బావ, మరో బైక్‌పై మృతుడు కార్లోసన్ వెళ్తున్నారు. ఈ క్రమంలో కొండపాక గ్రామ శివారులో కార్లోసన్ బైక్ అదుపు తప్పి రోడ్డుపక్కనున్న చెట్టును ఢీకొంది. తలకు బలమైన గాయాలవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.కళ్లేదుటే కొడుకు మృతి చెందడంతో తండ్రి, బావ రోదన చూపరులను కంటతడి పెట్టించాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతి గ్రామానికి ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

దుబ్బాక: మండలంలోని ప్రతీ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం రాయపోల్ మండలం రామ్‌సాగర్, ఉదయ్‌పూర్, సయ్యద్ నగర్ గ్రామాలలో పర్యటించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో కూలీలకు సరిపడా పనిదొరకడం లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాలలో వారిని తప్పకుండా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామ్‌సాగర్‌లో 25 డబుల్ బెడ్రూంలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా వాటిని ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. ఆయన వెంట డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, తదితరులున్నారు.

బీఎంఎస్‌ను గెలిపించాలి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాణే బ్రేక్ లైనింగ్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం పిలుపునిచ్చారు. బుధవారం రాణే పరిశ్రమ ముందు నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉన్న బీఎంఎస్‌ను విమర్శించే నైతిక హక్కు సీఐటీయూకు లేదన్నారు. సీఐటీయూ రెండుసార్లు అధికారంలోకి వచ్చినా కార్మికుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. కార్మికుల హక్కులను కాపాడలేని సీఐటీయూ నాయకులకు తగువిధంగా గుణపాఠం చెప్పాలన్నారు. బీఎంఎస్‌కు అధికారమిస్తే సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, నాయకులు చెన్న కేశవులు, మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వర్మ, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థికి అస్వస్థత

కౌడిపల్లి(నర్సాపూర్): గురుకుల పాఠశాల విద్యార్థి అస్వస్థతకు గురవడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స చేయడంతో కోలుకున్నాడు. కౌడిపల్లి ఎస్టీ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో కొత్తచెరువు తండాకు చెందిన ప్రతాప్ 8వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం రాత్రి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఉపాధ్యాయులు అతడిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకోవడంతో బుధవారం గురుకులానికి తీసుకొచ్చినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

ఏప్రిల్ 5న చలో పార్లమెంట్

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక, రైతు సంఘం నాయకులు

సిద్దిపేటకమాన్: పోరాడి సాధించుకున్న కార్మిక, కర్షక హక్కుల రక్షణ కోసం ఏప్రిల్ 5న చలో పార్లమెంట్ నిర్వహిస్తున్నామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ తెలిపారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గిట్టుబాటు ధరల చట్టంపై రైతాంగాన్ని నమ్మించి మోసం చేసిన మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి కార్మికులు, కర్షకులు ఢిల్లీకి రావాలని అన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి రాజ్యాంగం కల్పించిన సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా చేసిందన్నారు. కనీస వేతనాల జీవోలను సవరించకపోవడం వల్ల షెడ్యూల్ ప్రాంతాల్లో, నాన్ షెడ్యూల్ ప్రాంతాల్లో చట్ట ప్రకారం వేతనాలు అమలు కావడం లేదని ఆరోపించారు. అసంఘటిత కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు రోజు వేతనం రూ.600 లకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కళావతి, రైతు సంఘం నాయకులు, కార్మిక సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.